# ఇండియన్ ఎకానమీ

## కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాలు

### జాతీయ బాల స్వచ్ఛతా మిషన్

ఈ పథకాన్ని 2014, నవంబరు 14న ప్రారంభించారు. 'స్వచ్ఛ భారత్ మిషన్'లో భాగంగా పిల్లలకు ముఖ్యంగా స్కూళ్లలో చదువుతున్న బాల బాలికలకు తగిన ఆరోగ్యకరమైన మెరుగైన వాతావరణం, ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు లాంటి వసతులను కల్పించడం ద్వారా వారిని 'స్వచ్ఛ భారత్ మిషన్'లో భాగస్వామ్యులను చేయడం ప్రధాన ఉద్దేశం.

### ప్రధానమంత్రి జన ఔషధి యోజన

ఈ పథకాన్ని 2015 సెప్టెంబరులో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ప్రజలకు తక్కువ ధరల్లో తగిన ఔషధాలు/ మందులు అందించడం ప్రధాన ధ్యేయం. దీనిలో భాగంగా 3000 జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 500 కు పైగా వివిధ బ్రాండ్ల ఔషధాలు/ మందులను మార్కెట్ ధర కంటే తక్కువకే విక్రయిస్తారు. వీటిని ఏర్పాటుచేసే ప్రైవేట్ హాస్పిటళ్లు, ఎన్‌జీవోలు, ఇతర సామాజిక గ్రూపులకు కేంద్రం రూ. 2.5 లక్షలను ఏకమొత్త సాయంగా అందిస్తుంది. వివిధ ఔషధాలు/ మందులకు ప్రత్యామ్నాయంగా ఉన్న వివిధ జనరిక్ మందులను ఈ కేంద్రాల్లో విక్రయిస్తారు. అనంతరం ఇది 'ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన' గా మారింది.

### ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్

ఈ పథకాన్ని 2016, నవంబరు 4న ప్రారంభించారు. మాతృత్వ మరణాలు (MMR), శిశు మరణాలు తగ్గించే ఉద్దేశంతో గర్భిణులకు ప్రతినెలా తొమ్మిదో తారీఖున ప్రత్యేక యాంటీనాటల్ (Antenatal) చెకప్ ద్వారా సురక్షిత వైద్య సేవలు అందించడం దీని ప్రధాన లక్ష్యం. హైరిస్క్ ఉన్న మహిళలకు మరింత శ్రద్ధతో సేవలందించడం మరో ముఖ్య ఉద్దేశం. మాతృత్వ మరణాలను 70.2% వరకు తగ్గించడం ఈ పథక ప్రధాన లక్ష్యం. దాదాపు 3 కోట్ల మంది గర్భిణులు దీని ద్వారా లబ్ధి పొందుతారు. ప్రస్తుతం మన దేశంలో ప్రతి లక్ష జననాలకు 167 మాతృ మరణాలు సంభవిస్తున్నాయి.

### విద్యుత్ ఆధారిత పథకాలు

### సమీకృత శక్తి (విద్యుత్) అభివృద్ధి పథకం (IPDS)

ఈ పథకాన్ని 2015, సెప్టెంబరు 18న ప్రారంభించారు. అందరికీ 24 గంటలు (24/7) విద్యుత్ సౌకర్యం కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ పథకం ద్వారా రూ. 45,800 కోట్లు ఖర్చు చేయాలని సంకల్పించారు. విద్యుత్ ప్రసార నష్టాలను తగ్గించడం, నెట్ మీటరింగ్, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు, ఐటీ (IT) సాంకేతికతను ఉపయోగించడం లాంటివి ఈ పథకంలో ప్రధాన లక్ష్యాలు.

### ఉజ్వల్ డిస్కమ్ అస్యూరెన్స్ యోజన (UDAY)

ఈ పథకాన్ని 2015, నవంబరు 5న ప్రారంభించారు. డిస్కమ్‌లు అనే (DISCOMS) రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలను నష్టాల నుంచి బయట పడేయడానికి వాటికి తగిన ఆర్థిక తోడ్పాటు అందించడం, వాటిని పునరుద్ధరించడం కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర సాయంతో విద్యుత్ ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవడం డిస్కమ్‌ల ధ్యేయంగా నిర్దేశించారు. పుదుచ్చేరితో కలిపి 27 రాష్ట్రాలు ఈ పథకంలో చేరాయి.

### ప్రధానమంత్రి ఉజ్వల యోజన

ఈ పథకాన్ని 2016, మే 1న ప్రారంభించారు. దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 5 కోట్లకు పైగా కుటుంబాల స్త్రీలకు ఎల్‌పీజీ కనెక్షన్లు పంపిణీ చేయడం ప్రధాన ఉద్దేశం. రాబోయే 3 సంవత్సరాల్లో దీని కోసం రూ. 8000 కోట్లు ఖర్చు చేయదలచారు. 2016 – 17 ఆర్థిక సంవత్సరంలో దీని కోసం రూ. 2000 కోట్లు కేటాయించారు. నెలసరి వాయిదా సౌకర్యంతోపాటు ఆయా కనెక్షన్లు స్త్రీల పేరిట జారీచేస్తారు. ఒకటి కంటే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్న 10 లక్షల ఆదాయం పైబడినవారు స్వచ్ఛందంగా గ్యాస్ కనెక్షన్లు సరెండర్ చేయడానికి ప్రధానమంత్రి 'Give It Up' ప్రచారం కొనసాగిస్తారు.

### మిషన్ ఇంద్రధనుష్

ఈ పథకాన్ని 2014, డిసెంబరు 25న ప్రారంభించారు. 2020 నాటికి పిల్లలు, గర్భవతులకు ఏడు రకాలైన వ్యాధుల నుంచి రక్షణ కల్పించడానికి ఉద్దేశించింది. డిఫ్తీరియా, కోరింత దగ్గు (పెర్టుసిస్), టెటానస్, పోలియో, ట్యూబర్ క్యులోసిస్ (టీబీ), పొంగు, హెపటైటిస్-బి లాంటి ఏడు వ్యాధులను నిరోధించే టీకాలను ఎంపిక చేసిన రోగులకు 352 జిల్లాల్లో ఇస్తూ పూర్తి స్థాయిలో అక్కడ ఆ వ్యాధులను నిరోధించడాన్ని ముఖ్య లక్ష్యంగా పెట్టుకున్నారు.

### టూరిస్ట్ ఆధారిత పథకాలు

**స్వదేశ్ దర్శన్ యోజన:** 2015, మార్చి 9న దీన్ని ప్రారంభించారు. ప్రపంచ స్థాయి పర్యటక సదుపాయాల కల్పన దీని ప్రధాన ధ్యేయం. దేశవ్యాప్తంగా మత, సాంస్కృతిక, చారిత్రక పరమైన అవస్థాపన సదుపాయాలను అభివృద్ధి చేయడానికి 13 థీమ్ బేస్డ్ పర్యటక సర్క్యూట్ల (TBCT) ను ఏర్పాటు చేస్తారు.

**ప్రసాద్ (Prasad) (పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిరిట్యువల్ అగ్మంటేషన్ డ్రైవ్):** రూ. 100 కోట్లతో 13 నగరాలైన అమృత్‌సర్, అజ్మీర్, అమరావతి, ద్వారక, గయ, కాంచీపురం, కేదార్‌నాథ్, పట్నా, కామాఖ్య, మథుర, పూరీ, వారణాసి, వెలాంకనీల్లో ప్రపంచస్థాయి అవస్థాపనా సౌకర్యాలు కల్పిస్తారు. దేశంలో ఆధ్యాత్మిక కేంద్రాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. మత, ధార్మిక, ఆధ్యాత్మిక కోణంలో ప్రపంచస్థాయి పర్యటక అభివృద్ధి దీనిలో వ్యూహం.

## కేంద్ర ప్రభుత్వ ఇతర పథకాలు

### బేటీ బచావో, బేటీ పడావో యోజన

2015, జనవరి 22న దీన్ని ప్రారంభించారు. దేశంలో ప్రథమంగా 100 జిల్లాల్లో బాలబాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో బాలికల సంక్షేమానికి పాటుపడటం ఒక ఉద్దేశం. బాలికల సంక్షేమానికి చేపడుతున్న విధానాలపై తగిన అవగాహన కల్పించడం ముఖ్య లక్ష్యం. బాలికల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న (CSR) ప్రాంతాల్లో రూ. 100 కోట్ల నిధితో సంక్షేమ చర్యలు చేపడతారు. సాక్షి మాలిక్ దీనికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు.

### పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ

### శ్రమేవ్ జయతే యోజన (PDUSJY)

ఈ పథకాన్ని 2014, అక్టోబరు 16న ప్రారంభించారు. శ్రమ సువిధ అనే సమైక్య, శ్రామిక పోర్టల్ ఏర్పాటు ద్వారా పారదర్శక సమాచార, డేటా బేస్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం, దాదాపు ఆరు లక్షల పారిశ్రామిక యూనిట్లతో శ్రామిక గుర్తింపు సంఖ్య (LIN) ఏర్పాటు యూనిట్లకు అనుమతులు మంజూరు చేసే పర్యవేక్షణాధికారుల విచక్షణను తొలగించి తగిన సాంకేతికతను ఉపయోగించడం, 4.17 కోట్ల ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్‌లో యూనివర్సల్ అకౌంట్ నంబరు కేటాయింపు, దేశంలో 11,500 ఐటీఐలలో నైపుణ్యం ఉన్నవారిని బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తించడం, అఖిల భారత నైపుణ్య పోటీ ఏర్పాటు లాంటివి ఈ పథకంలో భాగం.

### వికల్ప్ స్కీమ్

రైళ్లలో ప్రయాణించే నిరీక్షణ జాబితాలోని ప్రయాణికులకు బెర్త్ ఖరారు కానప్పుడు తదుపరి ప్రత్యామ్నాయ రైళ్లలో ఖాళీలు ఉన్నప్పుడు వాటిలో బెర్తును ఖరారు చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. మెయిల్/ ఎక్స్‌ప్రెస్/ సూపర్ ఫాస్ట్ రైళ్లన్నింటిలో దీన్ని అమలు చేయదలచారు. 2016 – 17 బడ్జెట్‌లో దీన్ని ప్రకటించారు.

### నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్ స్కీమ్ (NSTSS)

దీన్ని 2015, ఫిబ్రవరి 20న ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 8 – 12 సంవత్సరాల వయసులోపు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ, ఆసక్తిని గుర్తించి వారిని తగిన క్రీడల్లో ప్రోత్సహించడం దీని ఉద్దేశం. తగిన శాస్త్రీయ శిక్షణ ద్వారా పిల్లల్లో క్రీడాశక్తిని పెంపొందించడం ఈ పథక లక్ష్యం. దీని కోసం నేషనల్ టాలెంట్ సెర్చ్ పోర్టల్‌ను ఏర్పాటుచేసి ఆన్‌లైన్ ద్వారా ఎంపిక ప్రక్రియను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చేపడుతుంది.

## పహల్ - డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌ఫర్ ఫర్ ఎల్‌పీజీ

## కన్స్యూమర్స్ స్కీం

దేశంలో ఎల్‌పీజీ (LPG ) గ్యాస్ వినియోగదారులకు సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో జమచేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద లబ్ధిపొందే లబ్ధిదారులు తమ ఎల్‌పీజీ కనెక్షన్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసుకోవాలి. దేశంలోని 622 జిల్లాల్లో 2015, జనవరి 1 నుంచి దీన్ని పునః ప్రారంభించారు. ప్రస్తుతం 640 జిల్లాల్లో అమలవుతోంది.

## మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా

## డెవలప్‌మెంట్ స్కీమ్

1993, డిసెంబరు 23న ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రతి పార్లమెంట్ సభ్యుడికి తన నియోజకర్గ అభివృద్ధికి ఏటా ప్రస్తుతం రూ.5 కోట్లు కేటాయిస్తున్నారు. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ (MOSPI) దీన్ని పర్యవేక్షిస్తుంది. అలాగే MOSPI దీనిలో భాగంగా 'One MP – One Idea' అనే పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద స్థానిక ప్రజల నుంచి అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి వినూత్నమైన ఆలోచనలను స్వీకరిస్తారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గం మూడు ఉత్తమ ఇన్నోవేటివ్ ఆలోచనలను ఎంపికచేసి, నగదు అవార్డులను ప్రకటిస్తుంది.

## సేతు భారతం ప్రాజెక్టు

ఈ పథకాన్ని 2016, మార్చి 4న 102 బిలియన్లతో ప్రారంభించారు. 2019 నాటికి దేశవ్యాప్తంగా హైవేల్లో రైల్వే క్రాసింగ్ సమస్య లేకుండా చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. 208 రైల్ ఓవర్, రైల్ అండర్ బ్రిడ్జ్‌లు నిర్మించడం ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా బ్రిటిష్ కాలం నాటి 1500 బ్రిడ్జ్‌లను విస్తరించడం, పునర్నిర్మాణాన్ని దశలవారీగా చేపట్టడం మరో లక్ష్యం.

## ఉడాన్ – RCS (UDAN-RCS)

2017, ఏప్రిల్ 27న దీన్ని ప్రారంభించారు. ఉడే దేశ్‌కా ఆమ్ నాగరిక్ (UDAN) అనే ఈ పథకాన్ని స్థానిక ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధిలో భాగంగా 'రీజనల్ కనెక్టివిటీ స్కీం'గా (RCS) ప్రారంభించారు.'Let the common citizen of the country fly' అనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 70 ఎయిర్‌పోర్ట్‌లను అభివృద్ధి చేస్తూ, డిసెంబరు 2018 నాటికి 150 ఎయిర్‌పోర్ట్‌లను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకంలో మొదటి విమానాన్ని 2017, మే 27న ప్రధాని మోదీ దిల్లీ – సిమ్లా, కడప – హైదరాబాద్ – నాందేడ్ మార్గాలకు ప్రారంభించారు. వీటి మధ్య ప్రయాణించే విమానాల్లో 50% సీట్లకు గంట ప్రయాణానికి రూ. 2500 ప్రయాణ ఖర్చుగా నిర్ణయించారు.

## ప్రధానమంత్రి ఖనిజ్ క్షేత్ర కల్యాణ్ యోజన

2015, సెప్టెంబరు 17న దీన్ని ప్రారంభించారు. ఈ పథకం ఖనిజాల కోసం తవ్వకాలు చేపట్టే, గనుల ప్రాంతంలో నివసించే ప్రజలు ముఖ్యంగా ఆదివాసుల సంక్షేమం కోసం ఉద్దేశించింది. దీని కోసం మైనింగ్ కంపెనీలు 10 నుంచి 30% రాయల్టీని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయా ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం చెల్లించాలి. దీని కోసం ప్రభుత్వపరంగా రూ. 6000 కోట్లు ప్రకటించారు. దేశంలో ఇలాంటి గనులు ప్రధానంగా షెడ్యూల్డ్ ఆవాస ప్రాంతాల్లోనే విస్తరించి ఉన్నందు వల్ల షెడ్యూల్డ్ తెగల సంక్షేమంపై ప్రధానంగా దృష్టి సారించారు. గనుల తవ్వకం వల్ల సంభవించే పర్యావరణ, ఆరోగ్య, సాంఘిక, ఆర్థిక ప్రభావాలను కనిష్ఠ స్థాయికి తగ్గించడం ముఖ్య లక్ష్యం.

## రాష్ట్రీయ వయోశ్రీ యోజన

2017, ఏప్రిల్ 1న ప్రారంభించారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న వయో వృద్ధులకు భౌతిక ఉపకరణాలు, అసిస్టెడ్ – లివింగ్ డివైసెస్ సరఫరా చేసే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 10.38 కోట్ల వయో వృద్ధుల్లో 5.2% వృద్ధులు ఏదో ఒక వయసు ఆధారిత వ్యాధితో బాధపడుతున్నారు. వృద్ధుల్లో వయో భారంతో వచ్చే సహజమైన వ్యాధులతోపాటు కొన్ని రకాల వైకల్యాలతో బాధపడుతున్నవారున్నారు. అలాంటి వారందరికి తగిన చేయూతనివ్వడం ఈ పథకం లక్ష్యం. 2026 నాటికి భారతదేశంలో 173 మిలియన్ల వయో వృద్ధుల జనాభా పెరగనుంది. వయసుతో పాటు వృద్ధుల్లో వచ్చే సహజమైన వినికిడి సమస్య, కంటి చూపు మందగించడం లాంటి సమస్యలకు నాణ్యతతో కూడిన తగిన ఉపకరణాలను అందించడం ద్వారా వారు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా ఈ పథకం ద్వారా చర్యలు చేపడతారు.

### రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియన్ (RUSA)

2013 అక్టోబరులో దీన్ని ప్రారంభించారు. 'జాతీయ ఉన్నత విద్యా మిషన్'గా పిలిచే ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నత విద్యావ్యాప్తికి తగిన వ్యూహాత్మక ఆర్థిక సాయం అందించడం ప్రధానోద్దేశం. దేశంలో 316 రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, 13,024 కాలేజీలను ఈ పథకం కింద అభివృద్ధి చేయదలచారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని యూనివర్సిటీలు, కళాశాలల్లో తగిన సదుపాయాలను కల్పించదలచారు. దీనికి అనుగుణంగా 12వ ప్రణాళికలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తిని 32% పెంచదలచారు.

ఉన్నత విద్యా సంస్థలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించడం, అకడమిక్, పరీక్షా సంస్కరణలను చేపట్టడం, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా నాణ్యతను పెంపొందించడం, నాణ్యత ఉన్న బోధనా సిబ్బంది నియామకం, విద్యా సంస్థల్లో నవకల్పనలను ప్రోత్సహించడం, గ్రామీణ, పట్టణ విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించి తగిన విధంగా సమతౌల్యం సాధించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. ఈ పథకం కింద 12 వ ప్రణాళికా కాలంలో 228.55 బిలియన్లలో 162.27 మిలియన్లు కేంద్రం అందిస్తే మిగతా మొత్తాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు భరిస్తాయి. ల్యాబొరేటరీలు, లైబ్రరీల లాంటి అవస్థాపనా సదుపాయాలను కల్పిస్తారు.

### ప్రధానమంత్రి గ్రామీణ, డిజిటల్ సాక్షరతా అభియాన్ (PMGDSA)

2017, ఫిబ్రవరి 8న గ్రామీణ భారత డిజిటల్ అక్షరాస్యత దిశగా ప్రయాణం ముఖ్య ఉద్దేశం. 2019 మార్చి నాటికి ఆరు కోట్ల గ్రామీణ కుటుంబాల్లో డిజిటల్ అక్షరాస్యతకు రూ. 2,351 కోట్లు ఖర్చు చేయదలచారు.

**కేంద్ర ప్రాయోజిత పథకాల (CSS) కుదింపు:** అరవైఆరు కేంద్ర ప్రాయోజిక పథకాలను 28 పథకాలకు కుదించాలని 2016 – 17 ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించారు.

**కీలక పథకాలు (Core schemes):** ఆరు పథకాలు దీనిలో ఉంటాయి.

**కోర్–ఆఫ్–కోర్ స్కీమ్స్:** దీనిలో ఇరవై పథకాలు ఉంటాయి.

**ఐచ్ఛిక పథకాలు:** దీనిలో రెండు పథకాలు ఉంటాయి.

**రచయిత: దాడి నారాయణరావు**

www.eenadupratibha.net